క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న కొండారెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన చేజర్ల కొండారెడ్డి దంపతులు మంగళవారం రూ.50వేలు విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు విజయసారథి, నాగభూషణం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

వరదయ్యపాళెం: మండల సర్వసభ్య సమావేశం బుధవారం 10 గంటలకు వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మప్రియ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆత్మీయ వీడ్కోలు



డాక్టర్ హర్షవర్ధన్‌ను సన్మానిస్తున్న నాగరాజు

ఏర్పేడు: బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి మంగళవారం ఆత్మీయ వీడ్కోల సమావేశం జరిగింది. పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో వైద్యులు హర్షవర్ధన్, అభిజ్ఞ, హరిణి, సీనియర్ అసిస్టెంట్ మృదుల, హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయిలను ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.

వైద్యసిబ్బంది శిక్షణ



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ హేమంత్

సత్యవేడు: దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీసిటీ మోండలేజ్(ప్రముఖ చాక్లెట్ తయారీ కంపెనీ), సేవ్ ద చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు జెండర్ రెస్పాన్సివ్, సోషల్ ఇంక్యూజివ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ హేమంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు గుణశేఖర్, మురళీకృష్ణ, సీహెచ్‌ఓ మీరాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేత



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని 10, 11, 26, 27 వార్డు సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ భీమారావు మాట్లాడుతూ.. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వడం హర్షణీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ తిమ్మయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ మల్లికార్జునగౌడ్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద లక్ష్మణ్ తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి ఎమ్మెల్యే జయపాల్‌యాదవ్ ఉన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు కోలా ఆనంద్, గరికపాటి రమేష్‌బాబు ఉన్నారు.

ఆర్టీసీలో ప్రతిభా పురస్కారాలు

తిరుపతి అర్బన్: వృత్తిలో ప్రతిభ చూపిన తిరుపతి డిపోలోని 18 మంది ఉద్యోగులకు డిపో మేనేజర్ బాలాజి మంగళవారం తిరుపతి గ్యారేజ్‌లో ఉత్తమ పురస్కారాలను అందజేశారు. ప్రధానంగా రాబడిలో ముందు వరుసలో ఉన్న ఇద్దరు కండక్టర్లు, ఇంధనం ఆదా చేసిన డ్రైవర్లు పది మందికి, సర్వీసులను కండిషన్‌లో ఉంచిన ఆరుగురు మెకానిక్స్‌కు పురస్కారాలు దక్కాయి.

జగనన్న సురక్ష.. సేవాదీక్ష

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- ముడియూరులో 1077 మందికి సర్టిఫికెట్లు పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ: వీఎస్‌పురంలో లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ఓ మహోన్నతమైనది అని, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడానికే సీఎం జగనన్న ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం మండలంలోని ముడియూరు సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడియూరు సచివాలయ పరిధిలో 273 మందికి కులం ధ్రువీకరణ, 386 మందికి ఆదాయ ధ్రువీకరణ, 314 మందికి ఆర్ఓఆర్ 1బీ, 67 మందికి ఆధార్‌కు మొబైల్ లింకింగ్, 2 కొత్త రేషన్‌కార్డులు, 3 స్ప్లిటింగ్, 4 పొజిషన్ సర్టిఫికెట్లు, 2 ఫ్యామిలీ సర్టిఫికెట్లు, 2 మరణ ధ్రువీకరణ పత్రాలు, 15 మంది కౌలు రైతులకు కార్డులు, 9 అడంగళ్లు మొత్తం 1077 సర్టిఫికెట్లను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

పలువురికి చేయూత..

అనంతరం సచివాలయ పరిధిలోని లక్ష్మీవిలాసపురానికి చెందిన కొత్తగా పెళ్లైన వివాహిత ఎ.గిరిజకు కల్యాణమస్తు పథకం కింద రూ.50 వేలును ఎమ్మెల్యే అందించారు. తులసికృష్ణాపురం హరిజనవాడకు చెందిన బొజ్జమ్మ, కొత్తగొల్లకండ్రిగకు చెందిన గీతాంజలి మరణించగా వారి కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.2 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, ఏఓ సంజీవ రెడ్డి, సీడీపీఓ శోభారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, సర్పంచ్‌లు శ్యామల, అన్నాదొరై, ఎంపీటీసీ సభ్యులు రాఘమ్మ, రమేష్ రాజు, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, సచివాలయ కన్వీనర్ మునిరత్నం రెడ్డి, వైస్ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, నాయకులు చలపతిరాజు, చెంగల్రాయ రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం మండలంలోని కడివేడు, రాజులకండ్రిగ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు పలురకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని మొత్తం 572 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ పద్మజ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, తహసీల్దారు ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సింగిల్‌విండో డైరెక్టర్ షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, అలగేశన్, సర్పంచ్‌లు భాస్కర్ రాజు, శేఖర్, ఎంపీటీసీ సభ్యులు రవి పాల్గొన్నారు.



పిచ్చాటూరు: ముడియూరులో సర్టిఫికెట్లు పొందిన వారితో ఎమ్మెల్యే ఆదిమూలం

బీఎన్‌కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని వీఎస్‌పురంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన పాల్గొని పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి పునాదులు వేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి సుపరిపాలన అందిస్తుంటే, టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా మాత్రం సిగ్గు, ఎగ్గూ లేకుండా కళ్లులేని కబోదుల్లా ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి, జిల్లా నాయకుడు మణినాయుడు, సర్పంచ్ సిద్ధమ్మ, ఎంపీపీ సుబ్బలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి, నాయకులు, తహసీల్దారు భార్గవి, ఏఓ త్రివిక్రమ్‌రావు, సీఐ విక్రమ్, ఎస్ఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ప్రజా సమస్యలను పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సులో పాల్గొన్న ఆయన 612 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్, యూత్ కన్వీనర్ వినోద్‌కుమార్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, స్థానిక సర్పంచులు, శ్రీకాళహస్తీశ్వర ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, రైతు సలహా మండల అధ్యక్షుడు మురళినాయుడు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ చెంగయ్య తల్లి పార్వతమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి వారి ఇంటి వద్దకు వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు.

21న సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు

వరదయ్యపాళెం: ఈ నెల 21న వెంకటగిరిలో నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు సత్యవేడు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున చేనేత కార్మికులు తరలివెళ్లి విజయవంతం చేయాలని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగనన్న నేతృత్వంలో చేనేత రంగానికి పెద్దపీట వేశారన్నారు. ఆ దిశగా మగ్గం ద్వారా ఉపాధి పొందుతున్న ఒక్కో చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ.24 వేలు చెల్లిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. అందువల్ల నేతన్న నేస్తం ద్వారా లబ్ధి పొందే ప్రతి ఒక్కరూ తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో జరిగే సీఎం కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా తరలివెళ్లి సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పృథ్వీ రవి, ప్రసాద్, వీరభద్రం, శేఖర్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం స్వాధీనం



స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని బోనుపల్లిలో పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ సుధీర్‌రెడ్డి తెలిపారు. 2016లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పేరుతో మాజీ సర్పంచ్ పంచాయతీ స్థలంలో కంచె ఏర్పాటు చేశారు. సమీపంలోని నదిలో బోరు వేసి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొంత కాలం పనిచేసిన తరువాత దానిని పూర్తిగా మూసివేశారు. బోనుపల్లిలో తాగునీటి సమస్య ఉండడంతో ప్రస్తుత సర్పంచ్ వాటర్ ప్లాంట్ స్థలం కావాలని అడగడంతో నిరాకరించాడు. ఆయన అధికారులకు తెలియజేయడంతో మంగళవారం రెవెన్యూ అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్థలాన్ని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించారు.

గడప వద్దకే ప్రభుత్వ సేవలు



నవ దంపతులకు వివాహ ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: ఎవరి చుట్టూ తిరగకుండా గడప వద్దకే పౌరసేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం ఉదయం నారాయణవనం-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో 962 సేవల కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిష్కరించి, వ్యక్తిగత సర్టిఫికెట్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అర్జీదారులకు అందజేశారు. అలాగే గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఆయన అందజేశారు. సర్పంచ్ శారదాగణేశన్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, కార్యదర్శి షణ్ముగం, మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు రాధ, పొన్నుస్వామి, రవి, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, మహిళలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊరందూరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన నాగరీ బోధ్ ప్రవేశ, ప్రథమ, మధ్య, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 42 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అభినందించారు. వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రమేష్‌బాబు, మురళి, శ్రీనివాసులు, రజియా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



కాళమనాయుడుపేటలో తాగునీటి కోసం వేస్తున్న బోరు

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేటలో గడప గడపకు మనప్రభుత్వం నిధులతో మంగళవారం తాగునీటి బోరు, పైపులైన్, మోటారు రూ.2 లక్షలతో ఏర్పాటు చేశారు. కాళమనాయుడుపేటలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్వహించారు. సర్పంచ్ టి.జయ, గ్రామ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. బోరు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఎంఈఓ కే.రవి అనుమతితో పాఠశాల ప్రాంగణంలో నూతనంగా బోరు ఏర్పాటుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి నిర్వహించారు.

పోషకాహార కిట్లు పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న వైఎస్సార్ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరులో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



చెల్లూరులో వలంటీర్ల పాదాలకు పాలాభిషేకం

ఏర్పేడు: సమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మోదుగులపాలెం, చెల్లూరు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మోదుగులపాలెంలో 447, చెల్లూరులో 711 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

వలంటీర్ల పాదాలకు పాలాభిషేకం

కరోనా వేళ ఎనలేని సేవలు అందించిన వలంటీర్ల పాదాలకు ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. చెల్లూరులో జెడ్పీటీసీ తిరుమలయ్య, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూనాటి రమణయ్య యాదవ్ వలంటీర్ల పాదాలకు పాలాభిషేకం చేశారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య, ఎంఈఓ ప్రేమలత, వైస్ ఎంపీపీలు తిరుపతి జనార్ధన్‌రెడ్డి, జముక్ల శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, ఎంపీటీసీ గౌరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు రమణయ్య యాదవ్, రాజేంద్ర, జనార్ధన్, మునిరత్నం, వేణు, మధు యాదవ్, సురేఖ పాల్గొన్నారు.

జగనన్న తోడుతో ఆర్థిక భరోసా



జగనన్నతోడు కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

శ్రీకాళహస్తి: చిరు వ్యాపారులకు జగనన్న తోడు ఆర్థిక భరోసా ఇస్తుందని.. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. జగనన్న తోడు కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ నుంచి లబ్ధిదారులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తోపుడుబండ్లు, టిఫిన్ సెంటర్లు, చేనేత, చేతివృత్తులు, ఇత్తడి పనిచేసేవారు, కలంకారీ తదితర వృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం రూ.10వేలు అందిస్తుందన్నారు. సకాలంలో కట్టిన వారికి ప్రభుత్వం వడ్డీ భరిస్తుందన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో 720 మంది చిరువ్యాపారులకు లబ్ధి చేకూరిందన్నారు.

కమనీయం.. గ్రామోత్సవం



తిరుచ్చి వాహనంపై నుంచి కటాక్షిస్తున్న ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: ఆండాళ్ అమ్మవారు మంగళవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరించారు. స్థానిక పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు ఈనెల 13న గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. స్వామి అష్టదల పాదపద్మారాధన సేవను నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేపట్టారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాళ్ అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు హారతులు ఇచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి అర్చకులు ఆస్థానం నిర్వహించారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు



సత్యవేడులో సర్టిఫికెట్లు చూపుతున్న లబ్ధిదారులు

సత్యవేడు: రాష్ట్రప్రభుత్వం ప్రజల ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ సేవలను ఉచితంగా తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం సత్యవేడు-3, మదనంబేడులో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సత్యవేడు-3లో 725 మందికి, మదనంబేడులో 691 మందికి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలురకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదే అన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు కేవీ నిరంజన్ రెడి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కే.చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, సచివాలయ కన్వీనర్లు మునికృష్ణయ్య, ఆనందయ్య, సర్పంచులు మంజుల, శివరంజని, నాయకులు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దారు రవిచంద్ర, ఆర్ఐ కిరణ్, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయానికి తాళం



వరదయ్యపాళెం వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

వరదయ్యపాళెం: మండలంలో వెలుగు అక్రమ రుణాల తంతు చిలికిచిలికి గాలివానలా మారుతోంది. సక్రమంగా రుణాలు బ్యాంకులకు చెల్లించినా తమ పేరిట ఉన్న అక్రమ రుణాల కారణంగా బ్యాంకుల్లో లోన్లు ఇవ్వకపోవడంతో పలువురు డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని మంగళవారం ఉదయం నుంచి వెలుగు కార్యాలయంలో సిబ్బందిని బయటకు పంపి బాధిత మహిళలతో కలిసి సీపీఐ శ్రేణులు ఆందోళన చేశారు. అదే సమయంలో అటువైపు ఇందిరానగర్‌లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిసి వారు తమ సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్, డ్వామా పీడీతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనకారుల వెంట సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, తరుణ్ ఉన్నారు.

కాపులకే కాపుగాస్తారా పవన్..?



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి రవి

శ్రీకాళహస్తి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాపు సామాజిక వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తారా అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ప్రశ్నించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ నాయకులు వరదయ్యపాళెంలో ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారన్నారు. ఇందుకు నిరసనగా జనసేన నాయకులు సీఎం దిష్టి బొమ్మను దగ్ధం చేయబోతుంటే పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. అందులో యోగేష్ అనే బీటెక్ విద్యార్థి కూడా ఉన్నాడని చెప్పారు. రిమాండ్‌లో ఉన్న కారణంగా సెమిస్టర్‌కు దూరం కావాల్సి వచ్చిందన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన కార్యకర్త కొట్టేసాయిపై సీఐ అంజుయాదవ్ చెయ్యి చేసుకుంటే మాత్రం ఆఘమేఘాలపై పవన్ కల్యాణ్ వచ్చి ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారన్నారు. కానీ వరదయ్యపాళెం ఘటనను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ రిమాండ్‌లో ఉన్న దళిత జనసేన కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. ఉద్యోగులు, కార్మికులకు హయ్యర్ పెన్షన్‌కు అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.